## 'సర్' ప్రక్రియపై శిక్షణ తరగతులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 25 నుండి ప్రారంభంకానున్న ఎస్ఐఆర్ సర్వేను పురస్కరించుకుని నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో గురువారం నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్ఐఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్ఐఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రేనర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ కీలక అంశాలను వివరిస్తూ బిఎల్ఓలకు దిశానిర్ధేశం చేశారు. ఎస్ఐఆర్‌లో భాగంగా 25 నుండి జూలై 24 వరకు బిఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరు రెండు చొప్పున ఎన్యుమరేషన్ ఫారాలందించాలని, వాటిని ఓటరు సరైన విధంగా పూరించారా అన్నది పరిశీలించాలన్నారు. శిక్షణ తరగతులలో ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు, ఎఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నూతనంగా ఏర్పడిన మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణం కొరకు కొమలంచ గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణగౌడ్ శంకుస్థాపన చేశారు. డ్వాక్రా సంఘాల వారు ప్రతీ నెల.. నెలవారి సమావేశాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. కాగా వారికి మహిళా సమాఖ్య భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీంధర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు హరీష్, కిరణ్, రఫి, జీవన్‌నాగభూషణంగౌడ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష కట్టుదిట్టంగా.. నిర్వహించాలి: కలెక్టర్




**ప్రజాపక్షం / సంగారెడ్డి :** 21న జిల్లాలో నిర్వహిచనున్న నీట్ 2026 పరీక్షను ఏలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అదికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం జూమ్ సమావేశం ద్వారా సంబంధిత శాఖల అధికారులు పరీక్షా కేంద్రాల చీప్ సూపరింటెండెంట్లు తహసీల్దార్లు తదితరులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాలలో 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నందున అత్యంత అప్రమత్తంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ స్థాయి పరీక్ష కావడంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే పరీక్షను విజయవంతం చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలు చేయాలని ,జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అదికారులను సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్యరెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా నోడల్ అధికారి (ఎన్‌టీఏ) భారతి దేవి, జిల్లా విద్యాశాఖ ఇంటర్మీడియట్ వైద్య ఆరోగ్య, పోలీసు ఆర్టీసీ, విద్యుత్ పోస్టల్, రెవెన్యూ,శాఖల అధికారులు తహసీల్దార్లు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీలు

ఎస్పి డి. వి. శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నా 80 మంది కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పి డి. వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించారు. ప్రతి కానిస్టేబుల్‌తో ఎఎస్పి వ్యక్తిగతంగా మాట్లాడి వారి విల్లింగ్ స్టేషన్లు, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థానం (స్పౌస్), సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డు, పిల్లల విద్య వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పారదర్శకమైన బదిలీల విధానం సిబ్బందిలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుతమైన విధుల నిర్వహణకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీసు అధికారిగా నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎస్పీ, విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మరింత మైరుగైన సేవలు అందించాలని దిశానిర్ధేశం చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన కానిస్టేబుళు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, సూపరింటెండెంట్ వల్యానాయక్ ఉన్నారు.

## ఆలయ నిర్మాణానికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం / పటాన్‌చెరు :** పటాన్‌చెరు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన గడప ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఆధ్యాత్మిక ఉట్టేపడేలా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, వృథ్వీరాజ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రామ్మోహన్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధం.. ప్రకటనలకే పరిమితమా?

ప్రగతి ధర్మారంలో మళ్లీ యథేచ్ఛగా బెల్ట్ దుకాణాలు

పంచాయతీ తీర్మానం అభాసుపాలు

**ప్రజాపక్షం/రామాయంపేట:** గ్రామాల్లో బెల్ట్ షాపులకు పూర్తిగా చెక్ పెడతాం..అక్రమంగా మద్యం అమ్మినవారికి లక్ష రూపాయల జరిమానా..సమాచారం అందించిన వారికి పదివేల నజరాన అంటూ కొద్ది రోజుల క్రితం మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం పంచాయతీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామాల్లో పెరుగుతున్న మద్యపాన వ్యసనాన్ని అరికట్టేందుకు పంచాయతీ ముందడుగు వేసిందని పలువురు ప్రశంసించారు. గ్రామాన్ని మద్యపానరహితంగా మార్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని భావించారు. అయితే గత కొద్ది రోజుల క్రితం మద్యం అమ్మిన వ్యక్తిని గ్రామ యువకులు పంచాయతీ పాలకవర్గానికి అప్పగించారు. అయినప్పటికి అమ్మిన వ్యక్తికి జరిమానా లేదు..పట్టించిన వారికి నజరాన ఇవ్వలేదు. దీంతో పరిస్థితులు మళ్లీ మొదటికే వచ్చాయి. తమను ఎవరు ఏమి చేస్తారనే దీమాతో గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు తెరుచుకున్నాయి. ఒక్క ప్రగతి ధర్మారం గ్రామంలోనే పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయంటే ఏవిధంగా వ్యాపారం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో రోజు కూలీ పనులు చేసి కుటుంబాలను పోషించే నిరుపేదలే ఎక్కువగా ఉంటారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కష్టపడి సంపాదించిన సొమ్ము మద్యానికి ఖర్చు చేస్తుండడంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మద్యం సేవించడం వల్ల ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో కు టుంబ కలహాలు, అప్పుల బాధలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న మద్యపాన నిషేధం అమలు కాకపోవడంతో పంచాయతీ పాలకవర్గంపై స్థానిక మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మద్యం దుకాణాలు పూర్తిగా మూతపడుతాయని ఆశించిన మహిళలకు ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులు నిరాశ కలిగిస్తున్నాయి. మొదట్లో కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించిన పాలకవర్గం ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉందో అంతుచిక్కడంలేదని స్థానికుల్లో చర్చగా మారింది. ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం అమలులో ఎందుకు విఫలమైందో స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. కేవలం తీర్మానాలు చేయడం ప్రచారాలు నిర్వహించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని తీసుకున్న నిర్ణయాలు కఠినంగా అమలు చేయాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అయితే ఇప్పుడు ఉన్న సర్పంచ్ గ తంలో మద్యం అమ్మకాలు జరిపేవారని అతని ప్రోద్భలంతోనే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ బంధువులు కూడా మ ద్యం అమ్ముతుండడంతోనే పంచాయతీ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా మ ద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ మండలంలోని రైతు వేదిక వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మండలానికి చెందిన 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ కుమార్తెల వివాహాలను ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ఐ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ వేణు, సర్పంచులు నాగమణి, రాజు, ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్, వార్డు సభ్యుడు సాయి, నాయకులు వొడ్డేటి నానయ్య, రెచర్ల మహేష్ పాల్గొన్నారు.

### మొక్క నాటిన ఎమ్మెల్యే

సిర్పూర్ టీ మండలంలోని వేంపల్లి నర్సరీ వద్ద వేప మొక్కను నాటి వన మహోత్సవం 2026–27 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవ వైవిధ్యం మెండుగా ఉన్న మన నియోజకవర్గంలో ప్రజల భాగస్వామ్యం లేనిదే అటవీ సంరక్షణ సాధ్యం కాదని తెలిపారు. కన్నెపల్లి మండలంలోని సాలిగాం నల్ల వాగు వద్ద లక్షల సంవత్సరాల క్రితమే రాక్షస బల్లులు తిరిగాయని, వాటి పాదముద్రలు ఇటీవలే శాస్త్రవేత్తలకు లభించాయని వివరించారు. అడవిలోని చెట్లు, జంతువుల సంరక్షణ కోసం యువత, మహిళలు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో ఎఫ్‌డిఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓ లక్ష్మ ణ్, డిఆర్ఓలు శశిధర్ బాబు, హేమలత, ఎఫ్ఎస్ఓలు జగన్ మోహన్ గౌడ్, కామరాజు, విజయ్, రమాదేవి, స్వాతి, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత: ఎంపి రఘునందన్



**ప్రజాపక్షం/రామాయంపేట:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. గురువారం మండల పరిదిలోని అక్కన్నపేట శివారులో నిర్మించిన అర్బన్ పార్కును జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఎంపి ప్రారంబించారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ఎంపి అక్కన్నపేటలో ప్రా రంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కా కుండా వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే చెట్ల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు ఉదయం రామాయంపేట మున్సిపాలిటి పరిధిలో వైస్ చైర్‌పర్సన్ నవనీత గణేష్, కమిషనర్ రవీందర్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## రైతులను రోడ్లపైకి లాగిన ఘనత రేవంత్ సర్కార్‌దే

ప్రభుత్వం ముందు డిమాండ్లు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రైతులను ఇబ్బంది పెడుతున్న యూరియా యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలని, రైతులకు ఎకరానికి నాలుగు సంచుల యూరియాను ఎలాంటి ఆంక్షలు లేకుండా ఒకేసారి పంపిణీ చేయాలని, సొసైటీలో షాపుల్లో సరిపడా యూరియా విరివిగా ఉంచాలని పలు డిమాండ్లతో నియోజకవర్గ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో 63వ నెంబర్ జాతీయ రహదారి వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద భారీ ధర్నా, రాస్తారోకో నిర్వమించారు. ఈ నిరసనలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టేరైతన్న నేడు కడుపు మంటతో, ఆవేదనతో రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితిని ఈ రాక్షస ప్రభుత్వం, దుర్మార్గపు సిఎం రేవంత్‌రెడ్డి కల్పించారని ధ్వజమెత్తారు. 'ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం' ఎన్నటికీ ముందడుగు వేయలేదని, రైతులు లేకపోతే రాజ్యమే లేదని మన పెద్దలు చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులు ప్రతి చిన్న అవసరానికి, హక్కుల కోసం రోడ్లెక్కి కొట్టాడాల్సి వస్తోందని, అలాంటి దారుణమైన పరిస్థితి నేడు రాష్ట్రంలో దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిఎంగా ఉన్న కెసిఆర్ రైతులను కంటికి రెప్పలా, గుండెల్లోపెట్టుకుని కాపాడుకున్నారని వేముల కొనియాడారు. కలెక్టర్, వ్యవసాయాధికారులు ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చేస్తున్న ప్రకటనలలో ఎలాంటి వాస్తవం లేదని వేముల స్పష్టం చేశారు. కెసిఆర్ పాలనలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుబంధు అందించి రూ. 75 వేల కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీనిచ్చినా ఐదు సీజన్లు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంత రైతులకు స్మార్ట్‌ఫోన్లు, యాప్ వినియోగంపై అవగాహన లేకపోవటంతో యూరియా పొందటం కష్టమవుతోందన్నారు. ఒకేసారి అవసరమైన ఎరువులు ఇవ్వకుండా పరిమితంగా పంపిణీ చేయటంతో రైతులు పలుమార్లు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## మందుబాబులకు అడ్డాగా.. నేరడిగొండ వ్యవసాయ కార్యాలయం!



**ప్రజాపక్షం/ నేరడిగొండ :** మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో ఈ కార్యాలయానికి రక్షణ తలుపులు లేకపోవడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని నిత్యం ఇక్కడికి వచ్చే వందలాది మంది రైతులు వాపోతున్నారు. ఈ కార్యాలయం లో మండల వ్యవసాయ అధికారితో పాటు ఏడుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు విధులు ని ర్వహిస్తుంటారు. అయితే, కనీసం ఇక్కడ వ్యవసాయ కార్యాలయం ఉందనే సూచిక బోర్డు గానీ, సంబంధిత శాఖ పేరు గానీ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కార్యాలయం పక్కనే రైతు వేదిక ఉండడంతో రైతులు పంటల సాగుపై సలహాల కోసం వస్తుంటారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు, ఎరువుల అవసరాల కోసం ఆఫీస్‌కు వస్తే సమయానికి అధికారులు ఎవరూ అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు వేదికి ఆవరణ అంతా చెత్తాచెదారంతో నిండిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వ కార్యాలయమనే స్పృహ లేకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మందుబాబుల ఆటలు సాగుతున్నాయని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించి కార్యాలయానికి రక్షణ కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు

కలెక్టర్ హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కె. హరిత తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బురుగూడా గ్రామంలోని కళావతి ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాప్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో నమోదు చేయాలని, అలాగే దుకాణంలో ఏర్పాటు చేసిన బోర్డు పై అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులను మోసం చేసే విధంగా నకిలీ పత్తి విత్తనాల విక్రయాలను ప్రభు త్వం ఏమాత్రం సహించదని స్పష్టం చేశారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, దుకాణ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో కేరమెరి గ్రామపంచాయతీ





**ప్రజాపక్షం / కేరమెరి :** గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కేరమెరి గ్రామపంచాయతీ ప్రస్తుతం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. సర్పంచ్ పెందూర్ ఆనంద్ రావు నాయకత్వంలో గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, సంక్షేమ పథకాల అమలు, పచ్చదనం పెంపు వంటి అనేక రంగాల్లో గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతోంది. గ్రామ ప్రజల అవసరాలను గుర్తిస్తూ, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ సర్పంచ్ పెందూర్ ఆనంద్‌రావు నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీధులు, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. దోమల నివారణ చర్యలు కూడా క్రమం తప్పకుండా చేపడుతున్నారు. వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచడంతో రాత్రి వేళల్లో ప్రజలకు భద్రత కలుగుతోంది. గ్రామ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడంలో గ్రామపంచాయతీ ముందంజలో నిలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, నిరుపేద కుటుంబాలకు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. గ్రామ ప్రజల సమస్యలు, అవసరాలను తెలుసుకునేందుకు క్రమం తప్పకుండా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను ప్రజల భాగస్వామ్యంతో రూపొందిస్తూ ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపుపై చర్యలు తీసుకుంటున్నారు. అలాగే గ్రామ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును పర్యవేక్షిస్తూ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటించి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దుతున్నారు.

గతంలో ఎన్నడూ కనిపించని స్థాయిలో గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, సంక్షేమ పథకాల అమలు వంటి రంగాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమస్యల పరిష్కారంలో సర్పంచ్ పెందూర్ ఆనంద్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుంటుండటంతో కేరమెరి గ్రామపంచాయతీ జిల్లాలోనే ఆదర్శ గ్రామపంచాయతీగా నిలిచే దిశగా ముందుకు సాగుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ ఆనంద్‌రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యాప్ ద్వారానే యూరియా బుకింగ్

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్లు, మార్క్‌ఫెడ్ వద్ద 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని వెల్లడించారు. రైతులు యూరియా కోసం క్యూలైన్లల్లో నిలమడకుండా యాప్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకుని, నిర్ణయించిన సమయంలో డీలర్ల వద్ద నుంచి ఎరువులు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో రెండు నుంచి మూడు డీలర్ పాయింట్ల వద్ద యూరియా నిల్వలు ఉంచినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, రైతు సేవా కేంద్రాల్లో లైసెన్సులను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు నకిలీ, నాసిరకం ఉత్పత్తుల విక్రయాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రై తుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక సేవలు అందించలని సూచించా రు.

### ఓటర్ జాబితా కోసం సమగ్ర సర్వే

**పాపన్నపేట:** పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. 25 నుంచి ప్రారంభం కానున్న 'సర్' సర్వేను పురస్కరించుకుని పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్ ప్రోగ్రాంపై బిఎల్ఒ, బిఎల్ఎ, బిఎల్ఒ సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్ఐఆర్ సర్వే ఎలా చేయాలి. ఏయే అంశాలను పరిశీలించాలి. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ కీలక అంశాలను వివరిస్తూ బిఎల్ఒలకు దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా 25 నుండి జులై 24 వరకు బిఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బిఎల్ఒలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారివారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుంచి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్ఐఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి, సంబంధిత బూత్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

‘ విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కలయికలో కొత్త సినిమా షూటింగ్ షురూ అయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మాణం; సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ , శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ’






# వెంకటేష్ కొత్త చిత్రం షూటింగ్ షురూ

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కలయికలో కొత్త సినిమా షూటింగ్ షురూ అయింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మాణం; సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ , శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ కాంబినేషన్ లో వినోదాత్మక చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్ చిత్రం 2027 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. కీర్తి సురేష్ కృతి శెట్టి ఇందులో కథానాయికలుగా నటిస్తున్నారు. చిత్ర బృందం పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఘనంగా జరిగిన ముహూర్తం పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. దిల్ రాజు, శిరీష్ స్రిష్ట్సనా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటికి అధికారికంగా అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముహూర్తం సందర్భంగా, విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టిలపై చిత్రీకరించిన మొదటి షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేష్ బాబు కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. దిగ్గజ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించారు. అనిల్ రావిపూడి శైలిలో సాగే, నిరంతర వినోదం నవ్వులతో కూడిన సంక్రాంతి చిత్రంగా ఉండబోతోంది. వెంకటేష్ , ఆకర్షణను జోడించడంతో, అత్యంత ఆసక్తి కరంగా మారింది. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎ స్. ప్రకాష్ ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా
# ‘వెంకట్రామయ్య గారి తాలూకా’



ఈటీవి సీరియల్స్ తో పాపులర్ అయిన నటుడు ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ వెంకట్రామయ్య గారి తాలూకా సినిమాతో హీరోయిన్ గా పరిచయం అవుతోంది. దినేష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల దర్శకత్వం వహిస్తున్నారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి నిర్మించిన చిత్రం ‘వెంకట్రామయ్య గారి తాలూకా‘ ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత కోమలి మాట్లాడుతూ నేను కోమలి ఫోక్ సింగర్ గానా కంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని సినిమా రంగం మీద నాకున్న ఇష్టం తో నేను సినిమా తీయాలి అని చాలా ఒడుదుడుకులని ఎదుర్కొని ‘వెంకట్రామయ్య గారి తాలూకా‘ చిత్రాన్ని పూర్తి చేశాము. ఈ సినిమా మొదలయినప్పటి నుండి ఇప్పటివరకు నేను పడిన కష్టం పడిన మాటలు కంటినిండా నిద్ర కూడా పట్టేది కాదు అన్ని కష్టాలు ఎదుర్కొని జులై లో మూవీ విడుదల చెయ్యడానికి రెడీ చేస్తున్నాము. దర్శకుడు సతీష్ అవాల మాట్లాడుతూ ‘వెంకట్రామయ్య గారి తాలూకా‘ చిత్రన్ని జులై లో విడుదల కానుండి త్వరలోనే డేట్ ఫైనల్ చేస్తామని చెప్పారు. ఒక పల్లెటూరు లో వెంకట్రమయ్య అనే పరువుగల కుటుంబం లోజరిగే ప్రస్తుతం మనుషుల మధ్య ఉన్న బంధాలు డబ్బు తో ముడిపడ్డాయి. మానవీయ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలు గా మారి పోయాయి. తల్లి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కడుపు కట్టుకుని ఎన్నో కష్టాలను భరిస్తూ పిల్లలను ఎంతో అల్లారు ముద్దగా నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేస్తున్నారు. కానీ తల్లి తల్లిదండ్రుల చివరి దశలో నలుగురు పిల్లలు కలిసి వాళ్ళని పెంచలేకపోతున్నారు. తల్లి తల్లిదండ్రుల గొప్పతనం తెలియచేసే సినిమా అని అన్నారు. ఈ చిత్రానికి కొరియోగ్రాఫర్: సాగర్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్: చరణ్ అర్జున్, కెమెరామెన్: బి. అనిల్ కుమార్, ఎడిటర్: మార్తాండ్ కె వెంకటేష్.

# బిజినెస్, సినిమా... రెండూ చేస్తున్నా

## హీరోయిన్ రాశీ సింగ్



వడ్డే నవీన్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు. ఈ సినిమాలో రాశీ సింగ్ హీరోయిన్ గా నటించింది 19న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో రాశీ సింగ్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఛత్తీస్‌గాఢ కు చెందిన నేను చిన్నప్పటి నుంచి ఏదో ఒకటి చేయాలని అనుకునేదాన్ని. మా నాన్న బిజినెస్ మెన్. అమ్మ ఎన్ జీఓ నడిపిస్తుంది. సోదరుడు హోటల్ మేనేజ్మెంట్ చేశాడు. ఇప్పుడు హైదరాబాద్ లో స్థిర పడ్డాం. నా సోదరుడు నేను కలిసి ఫుడ్ బిజినెస్ చేస్తున్నాం. నేను సినిమాలు, బిజినెస్ రెండు పడవల ప్రయాణం చేస్తున్న. రెండు కూడా హ్యాపీ గానే ఉంది. నాకు పద్నాలుగేళ్ళు ఉన్నప్పుడే మోడలింగ్ రంగంలో అడుగు పెట్టిన. మిస్ ఛత్తీస్‌గాఢ ఎంపిక య్యాను. తెల్లారి పేపర్ లో నా ఫొటో వచ్చాక మా ఇంట్లో తెలిసింది. దీంతో మా అన్న నన్ను బయటికి వెల్లనియ్యకుండా సుమారు మూడు నెలల పాటు హౌస్ అరెస్ట చేశారు. ఫోన్ కూడా లాక్కున్నారు. ఇంట్లోంచి బయటికి వెల్లే పరిస్తితి. ప్రసన్న వదనం లాంటి సినిమాల తరువాత ఇప్పుడు వద్దే నవీన్ తో ట్రాన్స్ ఫర్ త్రిమూర్తులు అనే సినిమా చేశాను. ఈ సినిమాలో నేను పక్కింటి అమ్మాయిగా నటించాను. నిత్యం ట్రాన్స్ ఫర్ అవుతుంటే సామాన్లు కూడా ప్యాక్ చేయకుండా అలానే ఉంచుతుంది అన్నమాట. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించారు. దర్శకుడు కమల్ తేజ్ చాలా క్లారిటీగా ఉన్న డైరెక్టర్. నవీన్ ను నేను ఫస్ట్ అడిగిన ప్రశ్న ఏంటంటే ఇంతకాలం తరువాత ఎందుకు సినిమా చేస్తున్నారు అని అడిగిన. ఆయన చాలా హార్డ్ వర్కర్. షూటింగ్ స్పాట్ లో మొట్ట మొదటగా వచ్చే వ్యక్తి నవీన్. షూటింగ్ ప్యాకప్ అయినాక లాస్ట్ కు పోయే వ్యక్తి కూడా నివీనే. నాకు అన్ని రకాల పాత్రలు చెయ్యాలని ఉంది. యాక్షన్ తో పాటు డి గ్లామర్ పాత్రలు కూడా చేయాలనుంది. కొంతకాలం ఎయిర్ హోస్టెస్ గా పని చేశాను. తరువాత సినిమా రంగంలోకి వచ్చాను. తెలుగు భాష నేర్చుకోడానికి నాకు రెండేళ్లు పట్టింది. నేను డబ్బును చాలా బాగా మేనెజ్ చేయగలను. కొన్ని సినిమాలు చేస్తున్నాను. ఒక సినిమాలో గ్లామర్ క్యారెక్టర్ కూడా చేస్తున్న. మా అమ్మ ఎన్‌జిఒ నడిపిస్తుంది కాబట్టి సేవా దృక్పథం నాకు చిన్నప్పటి నుంచే అలవాటు ఉంది. నా బర్త్ డే కు కూడా నేను చిన్నారులకు సహాయం చేస్తునే ఉంటా. కానీ రాజకీయాల్లోకకి వచ్చే ఆలోచన లేదు .

## శ్రీ విష్ణు హీరోగా
# కామ్రేడ్ కల్యాణ్



శ్రీ విష్ణు తన లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కామ్రేడ్ కల్యాణ్’తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ ఎల్‌పి బ్యానర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్సెమెంట్ పోస్టర్‌లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు .శ్రీ విష్ణు, మహిమా నంబియార్, రాధిక శరత్కుమార్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సమర్పణ: కోన వెంకట్, సంగీతం: విజయ్ బుల్గానిన్, డీఓని: సాయి శ్రీరామ్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్.

# 27న మళ్లీ ప్రేక్షకుల ముందుకు ‘కన్నప్ప’

హీరో విష్ణు మంచు గత ఏడాది ‘కన్నప్ప’ సినిమాతో జనం ముందుకు వచ్చారు. అవా ఎంటర్టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద ‘కన్నప్ప’ మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది నటీనటులు కీలక పాత్రలను పోషించారు. ఈ



సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న ‘కన్నప్ప’ను రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు రీ రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు.

# ‘సిప్పు సిప్పు’ పాట రిలీజ్

రవి వర్మ, రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కలప్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ‘గాసిప్ . వైభవ్ కౌండిన్య రూపొందిస్తున్నారు. ఈ సినిమా నుంచి సిప్పు సిప్పు ఫుల్ లిరికల్ సాంగ్ ని ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. శక్తి కాంత్ కార్తీక్ స్వరపరిచిన ఈ ఎనర్జెటిక్ పబ్ డాన్స్ ట్రాక్కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా సింగర్ మాళవిక గాత్రంతో పాటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గాసిప్ అనే ఈ సినిమా ఒక మిడిల్ క్లాసు అమ్మాయి చుట్టూ తిరిగే కథతో యూత్ కు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా తిర్చితిద్దుతున్నారు. సునీల్ సున్నపు మాస్టర్, ఫల్గుణి బంగెర కొరియోగ్రఫీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు శక్తికాంత్ కార్తీక్ , డిఓపి సతీష్ , ఎడిటర్ జై కుమార్ , సహ నిర్మాత నరసింహం తెలనాకుల.



# దేశ వ్యాప్తంగా అడవులను పరిరక్షించాలి

## జెఎస్‌పిసిబి పిటిషన్ విచారణ ‘సుప్రీం’ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** భారతదేశ వ్యాప్తంగా అడవులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గురువారం సుప్రీంకోర్టు పేర్కొంది. జార్ఖండ్‌లోని కొన్ని రాష్ట్రాలలో సహజ పర్యావరణవ్యవస్థలు ఉ న్నాయని వాటిని తప్పనిసరిగా పరిరక్షించాలని అత్యున్నత న్యాయస్థానం నొక్కిచెప్పింది. జార్ఖండ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు(జెఎస్‌పిసిబి) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరుపుతున్న ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ‘మన సహజ పర్యావరణ వ్యవస్థను మనం నిజంగా పరిరక్షించగల రాష్ట్రాలు కొన్ని మాత్రమే ఉన్నాయని, వాటిలో మీది (జార్ఖండ్) ఒకటి’ అని సిజెఐ జెఎస్‌పిసిబి తరపు న్యాయవాదిని ఉద్దేశించి అన్నారు.కొన్ని రాష్ట్రాలలో అడవుల వంటి స్వర్గధామాలు ఉన్నాయని, వాటిని రక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. జనవరిలో రాష్ట్రంలోని రక్షిత అడవుల నిర్ధారిత సరిహద్దులకు ఒక కిలోమీటర్ పరిధిలో రాతి తవ్వకాలకు లేదా రాతి క్రషర్లకు ఎలాంటి అనుమతి ఇవ్వరాదని హైకోర్టు ఆదేశించింది. అటవీ లేదా అటవీ భూమి చుట్టూ రాతి గనులు, రాతి క్రషర్లను ఏర్పాటు చేయడానికి గతంలో నోటిఫై చేసిన 400—500మీటర్ల నుంచి కనీస దూరాన్ని 250మీటర్లకు తగ్గించే జెఎస్‌పిసిబి జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్‌చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ జరుపుతున్న సమయంలో హైకోర్టు ఈ ఉత్తర్వును జారీ చేసింది.తన ఏప్రిల్ ఉత్తర్వులో రాతి తవ్వకాలకు సంబంధించి అడవులు లేదా అటవీ భూముల సరిహద్దుల నుండి 500మీటర్ల జోన్‌కు, రాతి క్రషర్లకు సంబంధించి 400 మీటర్ల జోన్‌కు అనుమతుల మంజూరుపై పరిమితి వర్తిస్తుందని హైకోర్టు పేర్కొంది.గురువారం జరిపిన విచారణ సందర్భంగా అధికార యంత్రాంగం ఆ దూరాన్ని ఆకస్మికంగా తగ్గించిన విషయాన్ని సుప్రీంకోర్టు గమనించింది. జెఎస్‌పిసిబి తరపున హాజరైన న్యాయవాది పరిశీలనను ప్రస్తావిస్తూ, హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల వల్ల అంతా స్తంభించిపోయిందని వివరించింది.ఈ కేసు హైకోర్టు పరిశీలనలో ఉందని, తుది విచారణ కోసం అక్కడే జాబితా చేయబడిందని బెంచ్ పేర్కొంది.

# సెర్ప్ ఆధ్వర్యంలో ‘విద్యార్థుల యూనిఫాం’ల తయారీ

## ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాముల సరఫరా...
## నేడు సిఎం చేతుల మీదుగా పంపిణీ కానున్న 5 వేల స్టూడెంట్ కిట్లు సిద్ధం...

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాకానుకలో భాగంగా 8,9,10వ తరగతి గురుకుల విద్యార్థులకు అందజేయనున్న ‘స్టూడెంట్ కిట్ల’ను సిద్ధం చేశారు. హైదరాబాద్ లోని ఎల్.బి. స్టేడియంలో శుక్రవారం సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందజేయనున్న 5వేల స్టూడెంట్ కిట్లను సెర్ప్‌ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలు సిద్ధం చేశాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన యూనిఫాములను సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాలు సిద్ధం చేస్తున్నాయి. విద్యార్థులకు సకాలంలో యూనిఫాములు అందించేందుకు మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మహిళల నైపుణ్యాలను ఉపాధిగా మార్చి, వారి కుటుంబాలకు ఆదాయ వనరులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను అందించే ఉమ్మడి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. 202627 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల మందికి పైగా మహిళా సంఘాల టైలర్లు యూనిఫాంల కుట్టు పనుల్లో పాల్గొంటున్నారు. వీరిలో దాదాపు 15 వేల మందికి ప్రత్యేక శిక్షణ అందించి, ఆధునిక ప్రమాణాలతో యూనిఫాంల తయారీ చేపట్టారు. విద్యార్థుల కొలతలను సేకరించి, వాటి ఆధారంగా యూనిఫాంలను కుట్టడం ద్వారా ప్రతి విద్యార్థికి సరైన కొలతలో దుస్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ‘మేకర్ అండ్ చెకర్’ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ప్రత్యేకంగా మహిళా సభ్యులను నాణ్యత పరిశీలకులుగా నియమించి, కుట్టిన ప్రతి యూనిఫాంను తనిఖీ చేస్తున్నారు. అలాగే అవసరమైన మార్పులు, చేర్పులు వెంటనే చేయడానికి గ్రామ స్థాయిలోనే టైలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులు ప్రతిరోజూ లక్షకు పైగా యూనిఫాంలను కుట్టి సంబంధిత పాఠశాలలు, గురుకులాలకు సరఫరా చేస్తున్నారు. విద్యార్థులందరికీ యూనిఫాంలు అందేలా వేగంగా పనులు కొనసాగిస్తున్నారు.



**మహిళా సంఘాలు రాష్ట్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు....**

మహిళా స్వయం సహాయక బృందాలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా ఎదుగుతున్నాయని మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. సెర్ప్ మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోందని, ఒకవైపు మహిళలకు ఆదాయం, మరోవైపు విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందేలా చేస్తున్న ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమన్నారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

సిఎం మండిపడ్డారు. ప్రజలకు ప్రాణాంతకమైన ఫార్మ సిటీని రద్దుచేసి 'కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తుంటే.ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్ ను ప్రజలు నిర్ణయిస్తే.. ఒకాయన ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. తాటి చెట్టు అంత ఎదిగిన ఇంకొకాయన ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు.

కబ్జాలు పెట్టే వారిని వదలం చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను కబ్జాలు పెట్టే ఎంతటి వారైనా వదలమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువులు కుంటలు కొంతమంది ఆక్రమిస్తే, వేలాదిమంది వరదల్లో మునిగిపోతున్నారని గతాన్ని గుర్తు చేశారు. ఎవరి స్థలంలో వారు కట్టుకుంటే అలాంటి వారి జోలికి హైడ్రా వెళ్లదని, కబ్జా పెట్టుకునే వారి వీపులకు సున్నం పెడుతుందన్నారు. పాలకులు కాలుష్యాన్ని పట్టించుకోకపోవడం వల్లనే ఢిల్లీ, బెంగుళూరు, ముంబాయి, కలకత్తా, వంటి నగరాలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నాయని గుర్తు చేశారు. హైదరాబాదులో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు మూసి పక్షులను చేస్తామంటే అడ్డుపడుతున్నారని, ఆనాడు మూసి పక్షంలో భాగంగానే ఎల్బీనగర్లో నందనవనంను నిర్మించి అక్కడి ప్రజలను తరలించడం జరిగిందన్నారు. ఇప్పుడు ఎవరు ఎమ్మెల్యే కావాలన్నా నందనవనం ప్రజలను దర్శనం చేసుకోవాల్సిందేనని తెలిపారు. ప్రపంచ చిత్రపటంలో శంషాబాద్ ఏర్పడే స్థాయికి వచ్చిందంటే అది అప్పటి మంత్రి దేవేందర్ గౌడ్ కృషి ఎంతో ఉందన్నారు. సద్ది కట్టుకుని



పోయి కూర్చుని శంషాబాద్ ఏర్పాటు నిర్మాణం కు ఆయన కృషి చేశారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నాడు ఎల్బీనగర్ లోని సిరీస్ కంపెనీ తో త్రిప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి మరోసారి పునరావృతం కావద్దని ఫార్మాసిటీని రద్దుచేసి ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని సిఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 5 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి గుర్రంగూడ నుంచి ప్రారంభించారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గం అంటే నాకు చాలా ప్రేమభిమానాలు ఉన్నాయన్నారు. నా సొంత ఊరుకు వెళ్లితే ఎలా ఉంటుందో, ఎల్‌బి నగర్‌కు వస్తే అనిపిస్తుందని ఆయన గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఇటువైపు ఎల్‌బి నగర్ కోసం ఎన్ని నిధులు మంజూరు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాన్నారు. అంతర్జాతీయ మార్కెట్ యార్డు తీసుకురావడం జరిగిందని, దాదాపు 240 కోట్ల వ్యయంతో పండ్ల మార్కెట్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం టి పి సి సి ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ ఇన్చార్జ్ మధుయాష్కీ గౌడ్ , తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్ ఎక్ర్సెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు మల్ రెడ్డి రంగారెడ్డి, కాల్వ సుజాత, జితేందర్ రెడ్డి, టిపిసిసి సభ్యులు దేప దీప భాస్కర్ రెడ్డి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిలు డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)

ఆ ద్రోహులు భారత వైమానిక దళం రక్షణను కోరాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ వారిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రౌత్‌తో పాటు సేన (యుబిటి) ఎంపిలు అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభావు వాజే ఈ సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు లోక్‌సభ ఎంపిలు హాజరుకాకపోవడం పార్టీ పార్లమెంటరీ విభాగంలో దాదాపు చీలిక వచ్చేనట్లేనని అర్థమవుతోంది. సమావేశానికి గైర్హాజరైన ఎంపిల్లో నాగేశ్ అష్టికర్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, సంజయ్ దినా పాటిల్, ఓంప్రకాష్ రాజెనింబాల్కర్, భాసాహెబ్ వాక్‌చౌరే ఉన్నారు. ఆ ఆరుగురు ఎంపిలకు ‘షోకాజ్’ నోటీసులు (వివరణ కోరే నోటీసులు) జారీ చేయనున్నట్లు సావంత్ విలేకరులతో చెప్పారు. ‘ఈ సమావేశానికి సంబంధించి విప్ (పార్టీ ఆదేశం) జారీ చేసినప్పటికీ వారు ఎందుకు హాజరుకాలేదో అడుగుతాము. సమాధానం ఇవ్వడానికి వారికి ఏడు రోజుల సమయం ఇస్తాము; ఒకవేళ వారు స్పందించకపోతే, వారి అనర్హతను కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తాము’ అని శివ సేన (యుబిటి) లోక్‌సభ ఫ్లోర్ లీడర్ పేర్కొన్నారు. ఎంపిలు హాజరుకాకపోవడాన్ని పార్టీ విప్ ఉల్లంఘనగా పరిగణిస్తామని, చట్ట సభ సభ్యులుగా వారిని అనర్హులుగా ప్రకటించేందుకు చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని రౌత్ తెలిపారు. షిండే నేతృత్వంలోని సేనలో విలీనం కావాలని కోరుతూ ఆ ఆరుగురు అసమ్మతి ఎంపిలు ఒక లేఖపై సంతకాలు చేసి, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ధృవీకరణ కోసం కొందరు ఎంపిలు స్వయంగా హాజరుకావాల్సి ఉంటుందని స్పీకర్ కార్యాలయం భావిస్తోందని, ఈ ప్రక్రియ త్వరలో జరిగే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రస్తుతం సంతకాల ధృవీకరణ ప్రక్రియ కొనసాగుతోందని ఆ వర్గాలు చెప్పాయి. కాగా, స్పీకర్‌కు రాసిన లేఖ నిజంగా ఉంటే, ఆ అసమ్మతి ఎంపిలు దానిని బహిర్గతం చేయాలని సావంత్ డిమాండ్ చేశారు. బుధవారం కూడా అసమ్మతి నేతలపై దూషణలకు దిగిన రౌత్, ‘ఈసారి వ్యవహారం అంత సులభం కాదు, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని స్పష్టం చేశారు. ‘ద్రోహులు తమ ఇళ్లకు గానీ, నియోజకవర్గాలకు గానీ తిరిగి వెళ్లలేరు. వారికి తగిన గుణపాఠం నేర్పిస్తాం. వారు ఇంటికి చేరుకోవడానికి సైన్యం సహాయం, రక్షణ కోసం భారత వైమానిక దళం సహాయం అవసరమవుతుంది’ అని రౌత్ హెచ్చరించారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితికి సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘమే బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం, శివసేన (యుబిటి) తన ఎంపిలకు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి హాజరు కావాలని త్రీలైన్ విప్ జారీ చేసింది. లోక్‌సభలో శివసేన (యుబిటి)కి తొమ్మిది మంది ఎంపిలు ఉన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హత నుండి తప్పించుకోవాలంటే వారిలో కనీసం ఆరుగురు కలిసి పక్షం మారాల్సి ఉంటుంది.

**శివసేన (యుబిటి) ఎంపిలకు వైప్లస్ సెక్యూరిటీ**

శివసేన (యుబిటి)కు చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎంపిలు వేరే పార్టీలోకి మారడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుండి వారికి బెదిరింపులు వస్తున్నందున మహారాష్ట్ర పోలీసులు వారికి ‘వైప్లస్’ భద్రతను కల్పించారు.

ఇంటెలిజెన్స్ కమిషనర్ శిరీష్ జైన్ సంతకం చేసిన లేఖ ప్రకారం, సంజయ్ దినా పాటిల్ (ముంబయి—ఈశాన్య), సంజయ్ దేశ్‌ముఖ్ (యావత్మాల్—వాషిమ్), సంజయ్ జాదవ్ (పర్భానీ), భాసాహెబ్ వాక్‌చౌరే (షిర్డీ), నాగేశ్ పాటిల్‌అష్టికర్ (హింగోలి)ష ఓంప్రకాష్ రాజే నింబాల్కర్ (ఉస్మానాబాద్)లకు ఈ భద్రత కల్పించారు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది ఆ లేఖలో పేర్కొన్నారు.

# ‘నేషనల్ డిఫెక్టర్స్ అలయన్స్’

(మొదటి పేజీ తరువాయి)

(డీలిమిటేషన్)కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడంలో విఫలమైనప్పుడు, ఈ ఏడాది ఏప్రిల్ 17న లోక్‌సభలో షాకు అవమానం ఎదురైందని, దానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఆయన ఇప్పుడు అత్యంత నీచమైన ఎత్తుగడలకు పాల్పడుతున్నారని రమేశ్ మండిపడ్డారు. షా రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడికి దిగారని ఆయన ఆరోపించారు. ‘ఎన్‌డిఎ (నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్)ను ‘నేషనల్ డిఫెక్టర్స్ అలయన్స్’గా మార్చడానికి అమిత్ షా కృతనిశ్చయంతో ఉన్నారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ఆయనకు అవమానం జరిగింది. పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన భావించారు’ అని రమేశ్ పిటిఐతో అన్నారు. ‘ఆయన (షా) ప్రధాన మంత్రి (నరేంద్ర మోదీ)కి హామీ ఇచ్చారు. కానీ ప్రతిపక్షాల ఐక్యత, సంఘీభావం కారణంగా ఆ బిల్లు ఆమోదం పొందలేదు. వారికి కేవలం 298 ఓట్లు మాత్రమే వచ్చాయి, కానీ 543 మంది సభ్యులు ఉండి ఓటింగ్ జరిగిన లెక్క ప్రకారం వారికి 362 ఓట్లు అవసరమయ్యాయి. కాబట్టి వారు మూడింట రెండు వంతుల మెజారిటీకి చాలా దూరంగా ఉండిపోయారు. అది వారికి అవమానకరం, ఎదురుదెబ్బ’ అని రమేష్ పేర్కొన్నారు. హోం మంత్రి దీనిని ఊహించలేదన్నారు. ఏప్రిల్ 17 నాటి ఆ అవమానానికి ప్రతిస్పందనగా హోం మంత్రి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని కాంగ్రెస్ నేత ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను అస్థిరపరిచేందుకు షా ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టారని ఆయన ఆరోపించారు. ‘ఒకప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్వహించిన పదవిలో ఉన్న వ్యక్తి, తనకు ఎదురైన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఇలాంటి అత్యంత నీచమైన ఎత్తుగడలకు పాల్పడటం నిజంగా సిగ్గుచేటు’ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. షా ఆడుతున్నవి అత్యంత నీచమైన ఎత్తుగడలు అని రమేశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం చేతులు కట్టుకుని కూర్చోలేదని, తన మిత్రపక్షాలు, ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com